# ముగింపు



చలపతిలో చలనం ప్రారంభమయింది. వళ్లంతా తేలిగ్గా వుంది. జలుబుచేసినప్పటిలా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బరువుగా సాగుతున్నాయి. శరీరం క్రింద యేదో మెత్తగా స్పాంజిలా వుంది. అసలు తనకు పడుక్కున్నట్లే లేదు. ఎక్కడో మేఘాల్లో తేలిపోతున్నట్లుగా వుంది. కళ్ళు తెరిచి చూశాడు. లైట్ల కాంతిని భరించలేక చప్పున మళ్ళీ కళ్లు మూసుకున్నాడు. తన శరీరం యింత తేలిగ్గా యెందుకుంది? ఎక్కడినుంచో మల్లెల వాసన వచ్చింది. చలపతికి మైకం కమ్మినట్లయింది. చలపతికి మల్లెలంటే అపరిమితమయిన యిష్టం ...నుదుటి మీద మృదువయిన హస్తం స్పృశిస్తున్నట్లు లీలగా తెలిసింది. గాజుల చప్పుడు కర్ణపేయంగా వినవచ్చింది.

అదృష్టం తన్ను వరించిందా?

తన కలలు పండినవా?

చలపతి ఒక్కసారిగా లేవబోయాడు.

రామవరపు వేణుగోపాలరావు

"ఆఁ....ఆఁ....లేవద్దు. అలాగే పడుకోండి."అన్న గొంతుక విన్పించింది.

చలపతి కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా స్టెతస్కోపుతో డాక్టర్, పక్కన ఒక యువతీ కన్పించారు.

ఇదేమిటి? తనింకా బ్రతికే వున్నాడా? తను ఆత్మని హత్య చేశాడే! అదే అడిగాడు. ఇద్దరూ నవ్వుకున్నారు. గాని సమాధానం చెప్ప లేదు. తను అయోమయంగా ఎటో చూస్తూ వుండిపోయాడు.

"ఇక, నే వెళ్తాను రాధమ్మా! ఇతనికి మరింకేం ఫర్వాలేదు. రేపు ప్రొద్దున్నే మళ్ళీ వస్తాను."అని డాక్టర్ వెళ్ళిపోయాడు.

చలపతి ఆ స్త్రీని చూస్తున్నాడు. ఆమెని చూస్తుంటే చచ్చిపోయిన వాళ్లమ్మ జ్ఞాపకం వొచ్చింది అతనికి. ఆ స్త్రీ చలపతి మంచంకి దగ్గరసా వచ్చి నిల్చుంది. రెప్పార్పకుండా అతన్ని చూసింది. 'చలపతీ!' అని పిల్చింది. ఆ పిలుపుకి చలపతి గుండె లోని గూడుపట్లు కదిలినై. జన్మ జన్మాల తపస్సమాధి భగ్నమయిన తపస్విలా చలించాడు. ఆమె....

రాధ....!

అవును. తనకి బాగా తెలుసు. రాధా వాళ్ళింట్లో తను ప్రతి సోమ వారం భోజనం చేసేవాడు. వారాలు చేసుకుంటూ చదివిన ఆ రోజులు తనకి జన్మలో మరపుకి రావు. రాధ....ఎంత పెద్దదైంది? మూర్తీభవించిన సౌందర్యరేఖలా..దయగల చూపుల్తో -'రాధా, నువ్వా?'అన్నాడు చలించి పోతూ.

"అవును. నేనే చలపతీ! అది సరే. నువ్వీ పాడుపని యెందుకు చేశావు? ఆత్మహత్య...."



''మహాపాపం అని నాకూ తెలుసు రాధా, కాని యేం చేయను? నాకంత కన్నా యింకోమార్గం కన్పించలేదు.''

''ఎందుకని? జీవిత మంత దుస్సహమయిందా?'' అని ప్రశ్నించింది రాధ మంచం పక్క నేవున్న కుర్చీలో కూర్చుంటూ.

''అవును.'' అన్నాడు చలపతి.

''బత్తాయిపండు వలుస్తాను. తింటావా?'' అంది రాధ లేవపోయి.

''ఒద్దొద్దు రాధా! నాకిప్పుడేమీ వద్దు. నువ్వేం అనుకోపోతే నాకు అన్నం పెట్టు. చాలా ఆకలిగా వుంది.''

నవ్వుకుంటూ లేచింది రాధ. అల్మారాలోంచి ఓ బత్తాయిపండు తీసుకుని కుర్చీలో కూర్చుంది. 'నీకు జ్వరం తగ్గేదాకా అన్నం పెట్టను. ముందీ పండు తిను.'' అంటూ బత్తాయిపండు వొలవడం ప్రారంభించింది.

సున్నితమయిన ఆ వేళ్లే ఒదలిక చలపతిని గిలిగింతలు పెట్టింది ఆ చేతుల్తో తనకి యెన్నోసార్లు వాళ్లింట్లో అన్నం పెట్టింది....

''అయితే, చలపతీ జీవితం అంటే నీ కెందుకంత విరక్తి? అసలు విరక్తి కలగటానికేనా కారణం యేమిటి? జీవితంలో నువ్వెన్నో వంతు చూశావని యీ వైరాగ్యం'' అంది రాధ చలపతిని చూడకుండానే బత్తాయి పండు వొలుస్తో.

'అన్నం ఉడికిందో లేదో తెలుసుకోవటానికి ఒక మెతుకు పట్టి చూస్తే చాలు రాధా. బ్రతుకుమీద అసహ్యం కలగటానికి నా కెదురైన అవమానాలూ–అనుభవాలూ చాలు. అయినా నే నొక నిశ్చయానికి వొచ్చాను. మరణం తప్ప నాకు వేరు గత్యంతరం లేదు.''

''చలపతీ!'' అంది రాధ ఖంగారుగా.

''ఏం రాధా, యెందుకా భయం? నాకసలు బ్రతకాలని లేదు. నేను ప్రపంచాన్నించి యేమీ కోరను నాకేం అఖ్ఖర్లేదు.''

''ఏమిటా పిచ్చి మాటలు చలపతీ? ఎందుకలా పదేపదే అంటావు? నాకు తెలుసు నీ ఆత్మహత్యకి కారణం. చెప్పనా?'' అంది రాధ ఒక తొన చలపతికి యిస్తూ.

''చెప్పు'' అన్నాడు చలపతి తొనని అందుకుంటో.

''నువ్వు చిన్నప్పటినుంచీ ఊహాజీవివి. నాకు తెలుసు ఏవేవో గాలి మేడలు ఆకాశంలో కట్టుకున్నావు. మనస్సులో యెన్నో భ్రమలు పెట్టుకున్నావు. అన్నీ భగ్నమయ్యాయి. ఒంటరితనం మిగిలింది. అదే నిన్ని విముఖతకి దారి చూపింది. అవునా?''

చలపతి ఒక క్షణంపాటు మౌనంగా

వుండిపోయాడు. అవును. రాధ చెప్పింది నిజమే! కాని –

"ఏం చలపతీ, ఏమంటావు?" అని రెట్టించింది రాధ.

"నువ్వు చెప్పింది కొంతవరకూ నిజమే రాధా. అయితే నాకు విరక్తి కలుగడానికి యింకా ఎన్నో కారణాలున్నాయి ...."

"చెప్పు మరి!"

"నేను కావాలనుకున్నవి నాకు లభ్యం కాలేదు. నాకు తెలుసు. నువ్వు వాట్ని దురాశ లంటావు. కాని కాదు. నాక్కావల్సింది ప్రశాంత జీవనం. నన్నూ నా క్షేమాన్నీ కోరే వారూ, స్వార్థంలేని సన్నిహితులూ నాక్కావాలి. నా కనీసావసరాలు తీర్చే ధనం కావాలి. నువ్వే చెప్పు వీటిని ఆశించడం తప్పంటావా? ఒక సామాన్య మానవుడిగా నా కా అర్హత లేదంటావా?" అన్నాడు చలపతి ఆవేశంగా. అతని కుడి చేతిలోని బత్తాయితొన రసం చిమ్ముతోంది.

"నీకు తెలీదేమో రాధా, నా చదువు మధ్యలోనే ఆగిపోయింది. అక్కడా యిక్కడా అరవచాకిరీలు చేశాను. సంపాయించే డబ్బు నా తిండికే చాలేది కాదు....అంతకన్నా ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాలికి నేను అనర్హుడిని."

రాధ అతని మాటలు వింటూ అలా నిశ్చలంగా రెండు క్షణాలపాటు వుండిపోయింది.

"అదీగాక భయంకరమయిన ఒంటరి జీవితం నన్ను నిలువునా పీడించింది. అనురాగాన్ని – సానుభూతినీ పంచుకోనే సన్నిహితులు లేని జీవితం ఎలా వుంటుందో నువ్వే ఆలోచించుకో రాధా" అన్నాడు చలపతి. కన్నీళ్లే తరువాయిగా వుంది అతని పరిస్థితి.

రాధ అచేతనంగా వుండిపోయింది. ఆమె జాలిగుండె, చలపతి వేదనకి ద్రవీభూతమయింది. కాని ఆమె ఏం చేయగలదు?

"నిరుత్సాహపడకు చలపతీ. గుండె నిబ్బరం చేసుకో. జీవితం కావాలని వుంటే మానవుడు దాన్ని తన పాదాక్రాంతం చేసుకోగలడు. బెదిరితే, అది మరింత భీకరంగా మానవుడిని వెన్నాడుతుంది. ఈ గొడవ కేంలే. ముందు పడుకొని రెస్టు తీసుకో.... రేపు మాట్లాడుదాం!" అని రాధ లేచింది. వెళ్ళిపోతూ "నీకేం కావలసొచ్చినా నన్ను పిలువ్" అంది.

చలపతి మెల్లిగా కళ్ళు మూసుకున్నాడు. ఏవేవో ఆలోచనలు అతని మెదడులో అల్లిబిల్లిగా అల్లుకుంటున్నాయి. ఏదో తెల్లని రూపు లేని ఆకారం తన్ను వెన్నాడుతోంది. అతన్ని చూసి రెండు హస్తాలూ సాచి

ఆహ్వానిస్తోంది. అప్పటివరకూ జరిగిన సంఘటనలను మరలా మనఃఫలకం మీద ప్రతిబింబించుకుంటూ క్రమంగా నిద్రపోయాడు.

అలా రెండు రాత్రులు గడిచాయి. చలపతికి స్వస్థత చేకూరింది. చాలా నెలల తర్వాత ఆ రోజు శుభ్రమయిన భోజనం కడుపు నిండా తిన్నాడు. రెండు వక్క పలుకులు నములుతూ రాధకోసం నిరీక్షిస్తూ కూర్చున్నాడు. దక్షిణంనుంచి వస్తున్న గాలి ఒంట్లోని రక్తాన్ని పలుకరిస్తున్నది. ఏవో కొత్త శక్తులు సంపాదించినట్లయింది చలపతికి.

"చలపతీ!"

అతనికి ఒంట్లో విద్యుత్ప్రవాహం ప్రాకినట్లయింది. ఆ కంఠంలో యెంత మృదుత్వం వుంది. తనని అంత లాలనగా పిల్చేవారు ఉంటారని తను ఎన్నడైనా అనుకున్నాడా? తల తిప్పి చూశాడు. గుమ్మంలో నిలబడ్డ రాధ ప్రాతర్మందానిలంలా నడిచి లోపలికి వొచ్చింది.

"పద చలపతీ, నీకు మా యిల్లు చూపిస్తాను." అంది.

మంత్రవశుడికి మల్లే చలపతి లేచాడు. హాలులోకి ముందర తీసుకెళ్ళింది. హాలు చూస్తో చలపతి నిర్విణ్ణుడయ్యాడనే చెప్పాలి. అంత ఆకర్షణీయంగా వుంది హాలు. గోడలకి ప్రసిద్ధ చిత్రకారుల వర్ణచిత్రాలూ, ప్రకృతి సౌందర్యం వెల్లివిరిసే ఛాయా చిత్రాలూ అత్యంత సుందరంగా అలంకరించబడి వున్నాయి. హాలుకి ఒక మూలగా చిన్న టేబుల్ మీద ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన బుద్ధ భగవానుడి విగ్రహం వుంది. అగరొత్తుల కమ్మని పొగ గౌతముడి నిమీలిత నయనాలను చుంబిస్తోంది. జాగ్రదవస్థలో వుండి స్వప్నంలో నడుస్తున్న అనుభూతిని పొందాడు చలపతి.


"నీ హృదయం ఎంత అందమయింది రాధా!" అన్నాడు అప్రయత్నంగా.

"నువ్వు చూశావా?"

పకపక నవ్వింది రాధ. ఆ నవ్వుకి తారలు కులికాయేమోనను కున్నాడు చలపతి. పొరపాటు తెలుసుకున్నాడు.

"పొరబాటు రాధా. అందంగా హాలుని అలంకరించావు గదా, నీ హృదయంలో ఎంత సౌందర్య తృష్ణ వుందీ అని నా ఉద్దేశ్యం...." అన్నాడు.

"దానికేం గాని పద" అంటూ మరో గదిలోకి తీసుకు వెళ్లింది.... అది లైబ్రరీ. అక్కడ ఒక వ్యక్తి కుర్చీలో కూర్చుని యేదో పుస్తకం చదువుకుంటున్నాడు. అడుగుల చప్పుడు విని తలెత్తి చూశాడు. చల




పతిని అతనికి దగ్గరిగా తీసుకెళ్ళింది రాధ.

"ఈయన మా వారు .... ఇతను నా చిన్నప్పటి స్నేహితుడు చలపతి" అంటూ ఒకరినొకరికి పరిచయం చేసింది రాధ. నమస్కార ప్రతినమస్కారాలు అయింతర్వాత కొంతసేపు ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు. రాధ భర్త ప్రభాకరం మంచి సెన్సాఫ్ హ్యూమర్ ఉన్న మనిషి. ఆ కాసేపట్లోనే అయిదారు తమాషాలు చెప్పి, చలపతిని నవ్వించాడు.

అలా ఒక వారం రోజులు గడిచాయి. ప్రశాంతమయిన వాతావరణం....చలపతి దైహిక మానసిక స్థితులను సంపూర్ణంగా మార్చివేశాయనే చెప్పాలి. అతను మారడానికి కారణం కొంతవరకూ రాధ కూడా. అనుక్షణం అతని అవసరాలు కనుక్కునేది. నిరాశాపూరితాలైన ఆలోచనల్తో మధనపడుతుంటే ఉల్లాసపూరితమయిన మాటలు చెప్పి అతన్ని ప్రపంచంలోకి లాక్కువచ్చేది.

ఒనాటి సాయంకాలం చలపతీ–ప్రభాకరం లాన్‌లో కుర్చీల్లో కూర్చున్నారు. ఉదయం పడిన వర్షం ఆకాశాన్నీ, భూమినీ స్వచ్ఛంగా కడిగి

పరిశుభ్రం చేసింది. దూరంగా పేరు తెలీని గడ్డిపువ్వులు ఎర్రగా అమాయకంగా నవ్వుతున్నాయి. చల్లటి గాలి శరీరాన్ని కితకితలు పెడ్తోంది.

చలపతికి ఎక్కడినుంచో ఓ పాట లీలగా వినరాసాగింది. ఆ గొంతు తనెన్నిసార్లో విన్నాడు. ఆ గొంతులోని విరహామాధుర్యాలు ... అభిసారిక గానమూర్ఛనలు ... మోహన వంశీ నాదాలు.... తనకు కొత్త వికావు. ఎన్నోసార్లు విన్నాడు. మళ్ళీ యిప్పుడు .... ఈ మనోజ్ఞ సాయంత్రనాన వింటున్నాడు.

'వికసించిన పూవులు పిలచె
నా హృదయము నిన్నే తలచె
రారా! గోపాలా! రావేరా?'

—అంటూ గాలి తెరల మీదినించి బరువుగా తేలివస్తోంది ఆ కంఠం. బృందావనంలో మురళీకృష్ణునిరాకకై విరహోత్కంఠిత అయిన రాధ పడే ఆవేదన ఆ గొంతులో ధ్వనిస్తోంది.

"ప్రభాకరంగారూ, ఆ పాట విన్నారా?" అన్నాడు చలపతి.

"ఆఁ" అంటూ చదువుతున్న పుస్తకంనుంచి దృక్కులు మరల్చాడు ప్రభాకరం.

చలపతి మళ్ళీ అదే ప్రశ్న వేశాడు.

అతను తేలిగ్గా నవ్వుతూ 'ఆ పాట పాడేది ఎవరనుకున్నారు? రాధ. అన్నాడు.

చలపతి ఆశ్చర్యానికి అంతేలేదు.

"రాధా? మరింతకాలం ఈ విషయం నాతో చెప్పలేదేం?" అన్నాడు చలపతి.

"ఆ గొంతుకలో మీరు విషం పోస్తారని అనుకున్నదేమో!" ప్రభాకరం దగ్గుతూ జవాబు చెప్పాడు.

చలపతిలో ఏ మూలో దాగిన రసహృదయం ఒక్కసారి విప్పిలింది. ఏదో ఉత్సాహం కట్టలు తెంచుకుని ప్రవహించసాగింది. ఎన్నో అస్పష్టమయిన మధురభావాలు అతని మెదడులో తెల్లని రెక్కలు విప్పుకుని ఎగరనారంభించాయి. ఆ అనుభూతిని మనసులో నింపుకుని అలాగే కొన్ని క్షణాల పాటు అనిర్వచనీయానందాన్ని అనుభవించాడు చలపతి.

రాత్రి ఏనిమిది గంటలప్పుడు రాధ వచ్చింది. చలపతి గదిలోకి ప్రవేశిస్తూనే "ఏం చలపతీ, భోజనమైందా?" అని ప్రశ్నించింది.

అప్పటికి చలపతి చాలా ఉత్సాహంగా వున్నాడు. ముఖంలో పూర్వం వుండే నీలినీడలన్నీ మాయమయినై. కొత్త ఉత్సాహంతో ఎంత బలం పుంజుకున్నట్లుంది అతని శరీరం.

"లేదు. సాయంకాలం నాకో అమ్మాయి తన గానమాధుర్యాన్ని నా గుండెలోకి చొప్పించింది. వాటిని

అతిగా త్రాగి మత్తెక్కివున్నానిప్పుడు. నాకు ఆకలీలేదు. గీకలీలేదు" అన్నాడు.

"అలాగా? ఎవరా అమ్మాయి చలపతీ?"

"ఆ అమ్మాయి పేరు రాధట. అందంగా వుంటుంది ఆ గొంతు అద్భుతం. తెలుసా?"

"అలాగా నాకు తెలీదే" అంటూ రాధ లోపలున్న కుర్చీలో కూర్చుంది.

"ఇవాళ సాయంకాలం రేడియోలో పాట పాడింది. 'వికసించిన పూవులు పిలచె....' అంటూ" అన్నాడు చలపతి మునుపటి ధోరణిలోనే. ఆమెను సమీపిస్తూ "అవును గాని రాధా....నువ్వింత చక్కగా పాడతావని నాకు తెలీదే!" అన్నాడు.

"ఇప్పుడు తెలిసిందిగా!" అంటూ నవ్వింది.

ఆ నవ్వు మల్లెలకన్నా ధవళంగా వుంది.

"అన్నట్టు .... ఈ సందర్భంలో యింకో విషయం గూడా చెప్పాలి నీకు. నాకున్న ఈ గొంతుకతోనే నాలుగు రాళ్ళు సంపాయిస్తూ నా జీవనరథాన్ని నడిపిస్తున్నాను. అంటే నా గానం నా ప్రాణం అన్నమాట!" అంది.

అప్పుడు చప్పున చలపతికి ఆమె భర్త విషయం జ్ఞాపకం వచ్చింది. రేడియోలోనూ — కచేరీల్లోనూ పాటలు పాడి నాలుగు రాళ్ళు సంపాదించుతూ రోగిష్టి భర్తని పోషిస్తున్నదన్నమాట! ఆమె పరిస్థితికి చలపతి యెంతో జాలిపడ్డాడు. అసలు ఆమె భర్త ఇంత చిన్నతనంలోనే పడువాని కరాళహస్తాల్లో ఎందుకు పడ్డాడు అతను దాంపత్య జీవనానికి — తన్ను పోషించటానికి అశక్తుడయినా రాధ ఎందుకు అతన్నే అంటిపెట్టుకుని వుంటున్నది? అలా వుండగలగటానికి రాధకేమైనా మానవాతీత శక్తులున్నయ్యా? ఇందులో ఏదో విశేషం వుండివుండాలనుకున్నాడు చలపతి.

"అన్నట్టు చలపతీ, జీవితం మీద విరక్తి పోయిందా? లేక యింకా వుందా?" అంది నవ్వుతూ రాధ.

చలపతి కూడా నవ్వాడు ఇంకా ఎక్కడి విరక్తి? ఈ గృహప్రాంగణంలో అడుగిడిన మరుక్షణం దాన్ని నాసేన్ సాగర్లో మరిచిపోయాడు. ఆ మాటే రాధకి చెప్తే ఆమె పకపకా నవ్వింది.

"నిజం చెప్తున్నాను రాధా. మొన్న మొన్నటివరకూ నేను గడిపిన చావు బ్రతుకుని తల్చుకుంటే నా కిప్పటికీ ఒళ్ళు జలదరిస్తుంది. అంత దుర్భరమయిన జీవితం గడిపాను. ఒక్క క్షణం కూడా మనశ్శాంతి వుండేది కాదు. అప్పుడప్పుడు — నవ్వే పసిపిల్లల్నీ, తెల్లటి ఆకాశంలో ఎగిరే పిట్టల్నీ

చూసినప్పుడు మాత్రం ఈ భయంకర స్వప్నాన్నుంచి ఎలాగోలా సుఖజీవన ప్రాంగణంలోకి అడుగెట్టగలననే ఆశ వుండేది. కొన్నాళ్ళకి అది నిరాశై మానసికంగా ఎండిపోయాను. మనస్సులో అణుచుకోలేని సౌందర్య తృష్ణనూ-సంతోషంకోసం అన్వేషించే ప్రయత్నాన్నీ పదేపదే అలాగే నా లోపలే అణుచుకుని ఉక్కిరి బిక్కిరయ్యే వాడ్ని....ఇప్పుడు—"అంటూ ఆగిపోయాడు చలపతి. మాటలు దొరకలేదు. తడబడ్డాడు కూడా.

"ఆఁ....చెప్పు చలపతీ, ఆగిపోయావేం ?"

చలపతి రాధను కళ్లార్పకుండా రెండు క్షణాలపాటు చూశాడు. నల్లని కేశ రాశి పసిమనసునికూడా కేరింతలు కొట్టించే నునుపయిన బుగ్గలు. రస్యంగా అస్తమిస్తోన్న సూర్యుడి కడపటి రశ్మిలా వెలిగే పెదవులు. వాటిమీద ఆ ప్రాంతానికే వన్నె చేకూర్చే దయగల చిరునవ్వు. వాటి అంతరాల్లో ధైర్యంచెప్పే నైజం.... ఇదంతా తెలియకపోవడానికి చలపతేమీ అంధుడు కాడు.

"ఇప్పుడు నువ్వు నాకు కన్పించావు. నన్ను ఆప్యాయంగా చూస్తున్నావు. నన్ను ఆదరంగా పిలుస్తున్నావు. ఒక మనిషి జీవితంలో రాజీపడటానికి ఇవి చాలు రాధా, ఇవి చాలు !" అంటూ ఆగిపోయాడు.

"అన్నట్టు చలపతీ, ఇదివరలో నువ్వు రాసిన కథలూ అవీ ఎక్కడున్నాయి ?"అంది రాధ ఆసక్తిగా.

"అవా ? 'మెహబూబ్ కా మెహిందీ'లోని నా రాజభవనంలో వున్నాయి అయితే అందులో మూడొంతులు పాత కట్ట పేపర్లవాళ్లకి అమ్ముడయిపోయింది"అన్నాడు చలపతి విషాదంగా నవ్వుతో.

"అవి తీసుకునిరా చలపతీ. ఇక్కడ నాకు తెలిసిన పబ్లిషర్ ఒకతనున్నాడు. అతనికి చూపిద్దాం !"

"అలాగే"


"ఇంకో సంగతి. నువ్వా గదిని ఖాళీ చేసెయ్. నీ సామాన్లూ గట్రా ఇక్కడికే తెచ్చేసుకో."

"అలాగే"

"మర్చేపోయాను. డబ్బేమయినా కావాలా ?"అంది రాధ చలపతిని నిశితంగా చూస్తూ.

చలపతి సిగ్గు పడ్డాడు.

"మొహమాట మెందుకు చలపతీ ? నన్ను వేరుగా భావించకు. ఏది కావలసినా అది నీకు సమకూర్చే భారం నాది. సరేనా! ఇదుగో తాళాలు. నా డ్రాయర్లో డబ్బుంది. కావలసినంత డబ్బు తీసుకో. నీ పరిస్థితులు బాగుపడ్డ



"ఇదిగోనండి లక్ష రూపాయల చెక్కు."
"ఎక్కౌంటులో నిల్ బేలన్సా లేక బ్యాంకు దివాలా అయ్యిందా-నిజంచెప్పేయండి."

తర్వాత యివ్వచ్చు" అంటూ తాళాలు చలపతి చేతిలో పెట్టి మెట్లవద్దకు నడిచింది రాధ.

నడిచే ఆ సౌందర్యరేఖని చూస్తూ నిశ్చలంగా నిలబడిపోయాడు చలపతి.

ఆ సాయంకాలమే చలపతి తన కాగితాల కట్టని తీసుకువచ్చాడు. ఆ కట్టలో అతను చేసిన సాహిత్య ప్రక్రియ లెన్నో వున్నాయి. మూడు నవలలూ-దాదాపు యాభై కథలూ. అవన్నీ చూసి రాధ ఆశ్చర్యపోయింది.

"నీ కెంత ఓపిక చలపతీ! ఇన్ని పుస్తకాలు నువ్వే రాశావా?" అంది.

"అవును." అన్నాడు చలపతి కొంచెం గర్వంగా. ఆ గర్వం తను రాసినందు క్కాదు. రాధ అతన్నలా ప్రశ్నించినందుకు. ఆమె ప్రతి పలుకూ ప్రతి చేష్టా కూడా తనని ఏవో వున్నత శిఖరాలకి లాక్కెళ్తున్నాయి.

రాధ ఒక పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుంది. ఆ నవల పేరు: "నాకీ జీవితం వద్దు!" పేరు చూస్తూనే రాధ నవ్వింది. అది చూసి చలపతి ఆడపిల్లలా సిగ్గు పడ్డాడు.

"చలపతీ, బహుశః! ఇది నీ జీవితానికి ప్రతిబింబ మనుకుంటాను." అంది రాధ పుస్తకం తిరగవేస్తో.

"అదొక్కటి మాత్రం!"

ఇంతలో చక్రాల కుర్చీని ఒంటిచేత్తో తోసుకుంటూ రాధ భర్త ప్రభాకరం వచ్చాడు.

"ఏమిటీ పుస్తకాలు ?" అన్నాడు వాటిని ఆశ్చర్యంగా చూస్తూ.

"అవన్నీ కాబోయే ప్రఖ్యాత రచయిత చలపతిగారు రాసినవి." అంది రాధ చలపతిని చూసి చిలిపిగా నవ్వుతూ.

"ఐ సీ. మీరు కథలుగూడా రాస్తారన్న మాట. గూడ్. రాధా, ఇవన్నీ నా గదిలోకి పంపించు. ఇవాళే చదివేస్తాను." అంటూ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

చలపతి కథల్ని ప్రభాకరం ఎంతగానో మెచ్చుకున్నాడు. ఇంత చక్కని రచనలు అజ్ఞాతంగా వుండిపోయినందుకు నొచ్చుకున్నాడు కూడా. రాధకి తెలిసిన ఒక పబ్లిషర్ చలపతి నవల నొకదాన్ని తీసుకున్నాడు. పేజీకి ముప్పావలా చొప్పున ఇస్తానన్నాడు. నవల ప్రచురించంగానే పాఠకలోకం నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. మొదటిసారిగా వేసిన వెయ్యి కాపీలూ చాల్లేదు. మళ్ళీ మరో ముద్రణ వేశారు. చలపతి రచనలు ఇప్పుడు విశేషంగా ప్రచురిత మవుతున్నాయి. అమ్ముడు పోతున్నాయి. పేజీకి ముప్పావలా యిచ్చిన పబ్లిషర్ చలపతి రాసిన మరో నవలని పేజీకి అయిదు రూపాయిలిచ్చి కొనుక్కుపోయాడు. మరి కొన్నాళ్ళకి చలపతి నలుగురు నోళ్ళల్లోనూ పడిన రచయిత అయ్యాడు. ఇప్పుడు చలపతికి ఊపిరి సలపని పని. ఉదయం నిద్రనుంచి లేచి రాయడానికి ఉపక్రమిస్తాడు. మధ్యాహ్నం ఒంటిగంటకి భోజనం. సాయంకాలం దాకా నిద్ర. రాత్రి ఎనిమిది వరకూ రాధతో పిచ్చాపాటీ. మళ్ళీ రాత.

చలపతి తన కథలిలా ప్రచురిత మవుతాయనీ—వాటిని పాఠకు లింతగా ఆదరిస్తారనీ ఏనాడూ అనుకోలేదు. అలా అనుకుని వున్నట్లయితే అతనంత గొప్ప రచయిత కాలేకపోయే వాడేమో. ఇప్పుడు చలపతికి బయట ఘనమైన గౌరవం లభిస్తోంది. పది మంది మిత్రులు .... సభలు .... సమావేశాలు .... పత్రికలు .... అన్నీనూ.

కొన్నాళ్ళు గడిచిన తర్వాత ఒక నాటి సాయంకాలం. ఎక్కడో దూరపు ఎడారుల్లోంచి వీచి వస్తోన్నట్లున్న వెచ్చటి గాలి. ఆ గాలి తెరలలో కళ కళ పడుతున్న పూలు. దూరంగా జంటగుబ్బలుల్ని కౌగిలించుకుని పరవశించి పోతున్న పశ్చిమాకాశం. మేడ మీద నిలబడి ఇదంతా చూస్తోన్న చలపతికి ఏదో అలౌకికమయిన తన్మయత్వం ఆవహించింది. అలా అలే చూస్తూ ఎంత సేపు వుండిపోయే వాడో గాని మధ్యలో నౌఖరు కుర్రాడు వచ్చి అతన్ని భంగపర్చాడు.

"అమ్మగారు డాబా మీద వున్నారు. మిమ్మల్ని రమ్మంటున్నారు" అని వాడు వెళ్ళి పోయాడు.

సిగరెట్టు వెలిగించి లేచాడు చలపతి.

మీద రాధ ఒక్కర్తే వుంది. తెల్లటి దుప్పటి పరిచిన పరుపుమీద ఎర్రటి చీరతో పడుకున్న రాధని చూస్తే చలపతికి 'రక్తకమలం' అన్న మాట జ్ఞాపకం వచ్చింది. చలపతి రాగానే రాధ లేచి కూర్చుంది. జుత్తు చెదిరి పోయి వుంది. పక్కమీద చేతులు అలసటగా అంటుకుని వున్నాయి. అతన్ని చూసి కాంతిగల కళ్లతో నవ్వింది. నలిగిన పక్కని సర్దుతూ 'రా చలపతీ.' అంది.

చలపతి వెళ్ళి మంచానికి ఒక మూలగా కూర్చున్నాడు. "ఎందుకు రాధా, పిలిచావుట?" అన్నాడు.

"ఆ పబ్లిషర్ మళ్ళీ కన్పించాడు చలపతీ. నువ్వేదో నవల నిస్తానన్నావుట. అడగమన్నాడు."

"అదే రాధా, మొన్న రాత్రి ప్రారంభించాను చూశావూ- ఓ ప్రేమ కథ. దాన్ని వాళ్ళ ఓ కొలిక్కి తెచ్చాను. ఇంకా పూర్తి కాలేదు. చేయగానే యిస్తాను—అది సరేగాని, యీ సంధ్యని చూశావా రాధా! ఎంత అందంగా వుందో. ఓ పాట పాడరాదూ? వింటాను."

"ఇప్పుడా?"

"అవును రాధా, ఇప్పుడే" అన్నాడు చలపతి. "సాయంకాలమయింది....సంధ్యాసుందరి తన పరిష్వంగంలో భానుడిని తన్మయస్థితిలోకి తీసుకుపోయి అతన్ని తనలో ఇముడ్చుకుంది. కలువకన్నెలు చంద్రుడికోసం కలలు కంటున్నాయి. అరగంటనుంచి రాధ నల్లనయ్యకోసం వెతుకుతోంది. చంద్రుడు కాలంతోబాటు పెద్దదవుతున్నాడు. కాని మనసుదోచిన మురళీకృష్ణుడు రాధకు కన్పట్టలేదు. అప్పుడా విరహాభిసారిక తన వేదనని కృష్ణుడికెలా నివేదించింది?—పాడు రాధా!"

"అలాగే పాడుతాను చలపతీ" అంటూ రాధ అతన్ని చూసి నవ్వింది. ఆ చూపుకి చలపతి పరవశించి పోయాడు. హృదయపు ఒంతరాళాలను కదిలించి లాగేసే శక్తి వాటికుంది. పెద్ద కళ్లు, తళతళలాడే కనుపాపలు. ఆకాశంలా శాంతమైన సుందరు. ఎందరు చూపుల్లోనో అతను చూశాడు గానీ ఏవీ తన నింతగా చలింపచేయలేదు. మనిషి మనుప్రత్వం నుంచి ఉన్నత శిఖరాలమీదికి లాక్కుపోతాయీమె చూపులు.

రాధ పాడటం ప్రారంభించింది. 'వికసించిన పూవులు పిలచె .... నా హృదయము నిన్నే తలచె' అంటూ. ఆమె పాడటం ప్రారంభించిన వగ్గ

ర్నుంచీ చలపతీ ఈ లోకంలో లేడు. అతని కళ్ళు దిగంతాల కావల ఎక్కడో వున్నాయి.

పాట పాడటం ఆపి రాధ చలపతిని తట్టింది. సమాధి భంగం పొందిన వాడిలా రాధని చూశాడు.

''చలపతీ బావుందా నా పాట?'' అంది నవ్వుతో.

''ఏమో నాకు తెలీదు. నువ్వు పాడిందగ్గర్నుంచీ నే నీ లోకంలో నే లేను.''

''భలే గా తప్పించుకున్నావే!'' అంది రాధ పిట్టగోడ దగ్గరికి నడుస్తూ.

చలపతి మంచంమీద కూర్చుని ఆకాశం వంక చూశాడు. దక్షిణ గాలుల మారాము ఎక్కువైంది. కొద్దిగా మంచుకూడా కురుస్తున్నది. మెల్లిగా నిలబడ్డాడు చలపతి. అతని నరాల్ని మీటే మధురమయిన బాధ అతన్ని రాధకి దగ్గరగా నడిపించింది. రెండు భుజాలమీద రెండు చేతులు వేసి ఆమెని చూశాడు. రాధ నుదురు దుర్నిరీక్ష్యమయిన తేజస్సుతో వింతగా వెలిగిపోతున్నది. కళ్లు సోగగా జాలిగా చలపతిని చూస్తున్నాయి. 'అలా నా వంక నిదానించి చూస్తో ఎందుకు నిల బడతావు రాధా? నా కళ్లల్లోనైనా నన్ను వేధించే భావాలు నీకు కన బడవా?' అనుకున్నాడు చలపతి మన సులో. ఆమె భుజాలమీది చేతులు తల చుట్టూ వెళ్ళాయి. నరాల హోరు అతన్ని పిచ్చివాడిగా చేసింది. పశు బలంతో ఆమెని తన హస్తాల్లో బంధించి విచ్చిన గులాబిలాంటి పెదిమలమీద ముద్దు పెట్టుకున్నాడు. అక్కడ్నించి నుదుటిమీదకి వెళ్ళాయి చలపతి పెది మలు. చటుక్కున ఆగిపోయాడు. రాధ కళ్ళు మూతలుపడి వున్నాయి. బుగ్గలమీది కన్నీటిబిందువులు చంద్ర కాంతిలో పాదరసంలా మెరుస్తు న్నాయి. చప్పున ఆమెని వదిలేశాడు.

''నీ ఉద్రేకం చల్లారిందా?'' అంది బాధగా రాధ.

''క్షమించు రాధా!'' అన్నాడు చలపతి సిగ్గుతో తల వంచుకుని.

విషాదంగా నవ్వింది రాధ.

కొన్ని క్షణాలు నిశ్శబ్దంతో బరు వుగా గడిచినై.

''రాధా, నిన్ను ఒకటి అడగా లనుకుంటున్నాను'' అన్నాడు చలపతి పొడిపొడిగా.

చీరచెంగుతో బుగ్గలు తుడుచు కుంటూ 'నన్నా, ఏమిటి?' అంది రాధ.

''ఈ సారవిహీనమయిన జీవితం లోంచి నువ్వు బయటపడలేవా?'

''పొరపాటు పడ్తున్నావు చలపతీ సారవంతం సారవిహీనం అన్న సంగ




మనుష్యుల హృదయాలను బట్టి— సంతృప్తిపడగల శక్తినిబట్టివుంటుంది" అంది రాధ. ఆమె మాటలు గాలిలో బరువుగా తేల్తున్నాయి.

మళ్ళీ మరికొన్ని క్షణాలు మూగగా గడిచాయి:

**"రాధా! నీ జీవితానికి అర్థం ఏమిటి? ఎందుకు బ్రతుకుతున్నావు? ఎవరికోసం? అందరిలాగా నీకు జీవితం** సుఖమయంగా గడపాలని లేదా?" అన్నాడు చలపతి ఆవేశంగా.

రాధ మాట్లాడలేదు. ఆమెకిమాత్రం అందరిలాగా సుఖంగా జీవించాలని ఎందుకు లేదు. సుఖజీవనమంటే అసలు అర్థం ఏమిటి? అదెలాంటిది? అదే ఆలోచిస్తోంది రాధ.

"నీ అంతరంగిక జీవితంలోకి తొంగి చూస్తున్నందుకు నన్ను క్షమించు

రాధా! నిన్ను సుఖపెట్టలేని పక్షవాత రోగితో జీవిస్తూ నీ పచ్చని జీవితాన్ని ఎందుకు నరకంగా చేసుకుంటున్నావు? చట్టసమ్మతంగా నువ్వతన్నుంచి విడిపోయే హక్కు నీకుంది. నువ్వతని మీద ఆధారపడటంకూడా లేదు. మరెందుకు నువ్విలా ఈ నికృష్టజీవనాన్ని గడుపుతున్నావు?"

అప్పటికీ రాధ మాట్లాడ లేదు. చలపతి ఉద్రేకంతో ఊగిసలాడిపోతున్నాడు. రాధ పిట్టగోడ నానుకుని మూగగా రోదిస్తోంది.

"ఊరూ వాడా లేనివాడిని. నన్ను మనిషిగా చేశావు. నాలో నిద్రాణమై వున్న శక్తుల్ని మేల్కొల్పి నన్ను వెలుగులోకి తీసుకొచ్చావు. మరి నువ్వెందుకు రాధా! ఇలా యీ అంధకారంలో అసమర్థుడితో జీవితయాత్ర సాగిస్తున్నావు? రోజులెప్పుడూ ఒక్కలా వుండవు. నీలోని బలం - శక్తి - ధైర్యం అన్నీ నశించే రోజులొస్తాయి. అప్పుడు నీకు ఎవరు సహాయం చేస్తారు. అండగా ఎవరు నిలబడతారు. నీ జీవితాన్ని నువ్వే ఎందుకిలా భయంకర స్వప్నంగా మార్చుకుంటున్నావు?" అంటూ అలసటగా ఆగాడు చలపతి. తను చెయ్యదామనుకున్నది సరిగా వ్యక్తపరచలేకపోతున్నాడు. సూటిగా ఆమెని అడగే ధైర్యం తనకెందుకో లేకపోతోంది.

రాధ యింకా అలాగే మొహం అటు త్రిప్పుకుని ఏడుస్తోంది. "రాధా!" అని పిలిచాడు చలపతి గంభీరంగా. "నువ్వు నన్ను ప్రేమించటం లేదా? కనీసం అర్థం చేసుకోలేదా?" అన్నాడు.

రాధ చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది. చలపతివేపు తిరిగింది.

"నువ్వనేది నాకు తెలుసు చలపతీ! నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నిజమే. కాని ఆ ప్రేమకి విలువలూ-ఫలితాలూ కట్టడానికి ప్రయత్నించకు. సాధారణ ప్రేమకి అంతం కామం. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. కారణం: నీలోని ప్రతిభ కావచ్చు. నీ మీద జాలి కావచ్చు. గాని నీ మీద మోహం కాదు. అది గుర్తుంచుకో...."

చలపతి ఆమె మాటలు వినేస్థితిలో లేడు.

"నాకు నువ్వు కావాలి రాధా! నువ్వే కావాలి. ఇన్నాళ్ళూ నీ కోసమే అంధకారంలో అన్వేషించానా అనిపిస్తోంది. నువ్వు నా సహచరిణిగా వుంటే ఆ భాగ్యమే లభిస్తే ఈ జీవితం ఎంత దీర్ఘంగానీ భరిస్తాను. ఎంత కష్టంగానీ సహిస్తాను. ఏం రాధా. నువ్వు నా దానివి కాలేవా?" అన్నాడు చలపతి.

రాధచూపులు ఎక్కడో శూన్యంలో వున్నాయి. "క్షమించు చలపతీ — ఈ

జన్మలో నేను నీ దాన్ని కాలేను. నాకా అవకాశం లేదు" అంది మెల్లిగా.

"ఏం ఎందుకని?"

"నేను వివాహితను."

"కావచ్చు. కాని, నీ భర్త నిన్ను పోషించలేని అసమర్థుడు. నిన్ను సుఖపెట్టలేని రోగిష్టి. నీ జీవితానికి దాపురించిన దుస్వప్నం...."

"చలపతీ!"

ఉలిక్కిపడ్డాడు చలపతి. కోపంతో ఎర్రనైన రాధ మొహం చూడడం అతనికి అదే మొదటిసారి.

"చలపతీ, నన్నేమయినా అను. కాని ఆయన్నేమీ అనకు. కాగడా పెట్టి వెదకినా అంత మంచి మనిషిని నువ్వీ ప్రపంచంలో చూడలేవు. పద్నాలుగేళ్ళ రాధ తెలుసు నీకు. గాని ఇరవై ఏళ్ళ రాధ జీవితం నువ్వెరగవ్. అది నా నోటితో నీకు చెప్పలేను కూడా. ఇదుగో నా డైరీ...." అంటూ మంచం మీదున్న పుస్తకం చేతిలోకి తీసుకుని ఆరు కాగితాలు చించి "ఇదిగో. నా జీవితంలో ముఖ్యమయిన ఈ ఆరు రోజుల డైరీని చదువు. నా బాధ, నా వేదన, నా గమ్యం అన్నీ నీకర్థమవుతయ్" అని వస్తోన్న ఏడ్పుని అపుకుంటూ మెట్లమ్మట క్రిందికి దిగింది రాధ.

రెపరెపలాడ్తోన్న ఆ కాయితాల్ని విచిత్రంగా చూశాడు చలపతి. అనే మిటో చదవాలన్న కోర్కెను చంపుకోలేకపోయాడు. క్రిందికి దిగి తన గదిలోకి వెళ్ళాడు. మొదటి కాగితం చూశాడు. ముత్యాల కోవలాంటి దస్తూరీ అది:

15 జనవరి 1962

ఈ రోజు చాలా ఆనందంగా గడిచింది. సువర్చల పుట్టినరోజు ఈవాళ. టీ పార్టీ ఇచ్చింది. మేడ ముందున్న కొబ్బరి తోటలో పచ్చని గడ్డిమీద కుర్చీలూ-టేబుల్సూ వేశారు. అచ్చం పెళ్ళికూతుర్లా తయారైంది సువర్చల. పార్టీ అదీ అయినతర్వాత నన్ను పాడమని బలవంతం చేశారు. అప్పుడు నాకిష్టమయిన

"ఎంత వేదన నాకు తెలతా
ఎంత వేసట నాకు మెలతా
కోరుమును వానలో
కన్యకుటిలో జేరి
ఛాంద్రపదమున నోంటి
బాధపడుచుంటినే!"

—అన్న పాట పాడాను. పాడుతున్నంతసేపూ గోపీ రెండు చుక్కలయిన కళ్ళు ఆశ్చర్యంగా చూడటం గమనించాను. పాడిన తర్వాత అతను నా దగ్గరకి వచ్చి ఎప్పుడు గీతాలేవయినా పాడుతున్నావా. అంత మందిలో నన్నలా అడిగేసరికి నాకు సిగ్గేసింది. సువర్చలతో కూడా బలవంతం చేయాగా 'రాధిక పేరు ... దేవాం

రా ధా !' గీతాన్ని ఆలపించాను. వీణ వాయిస్తూ అతను ఆనందంతో సగంలో ఆగిపోయాడు. అతన్ని చూసి నాకు జాలివేసింది. అతనిలోని సంగీతతృష్ణని అభినందించకుండా వుండలేక పోయాను. అతను సువర్చల అన్న య్యట. అంతవరకూ సువర్చలకో అన్నయ్య వున్నట్లు నాకు తెలీదు.

20 ఫిబ్రవరి 1962

నేనూ, సువర్చల, వాళ్ల అన్నయ్యా ముగ్గురం వేలీగార్డెన్స్‌కి పిక్నిక్ కెళ్లాం. రెండు ఫ్లాస్కులనిండా కాఫీ ఇతర తినుబండారాలూ తీసుకువచ్చింది సువ ర్చల. వాళ్లన్నయ్య కెమేరా తీసుకు వచ్చాడు. నన్నూ, సువర్చలనూ వివిధ భంగిమల్లో ఫొటోలు తీశాడు. గాలికి ఆకులు మా బుర్రలమీద రాల్తోంటే - చల్లని సముద్రపుగాలి ఒంటిని పులక రింపజేస్తుంటే ఆ లోయల్లో మధ్యా హ్నం ఒంటిగంట దాకా పేకాడు కున్నాం ముగ్గురం. ఆట యింకా ఎంతవరకూ సాగేదోగాని సువర్చల మధ్యలో ఆఁ అంటూ లేచింది. దాంతో పేకాటకి గుడ్ బై చెప్పి తినుబండా రాలమీద దాడిచేశాం. తినగలిగినంత తిని సువర్చల శుభ్రంగా త్రేన్చింది. ప్లాస్టిక్ బేగ్‌లో వారపత్రిక తీసి చదువుకోవడం ప్రారంభించింది. కెమేరాలోకి ఫిల్మ్ లోడ్ చేస్తున్న ప్రభాకరం మా వేపు చూసి "అలా రండి సువర్చలా, ఆ వెపు సినరిలు ఇంకా అద్భుతంగా వుంటై. ఫొటోలు తీస్తాను" అన్నాడు.


"అబ్బ! నేను రాను బాబూ, నాకు బద్ధకంగా వుంది." అంది సువర్చల. నా వేపు చూశాడు ప్రభాకరం "నేను వస్తా" అన్నాను. ఇద్దరం ఆ పచ్చటి చెట్ల మధ్య పసివాళ్ళలా పరుగెత్తాం. ఒకచోట ఆగి ప్రభాకరం నన్నో కొబ్బరి చెట్టు జోరె ప్రక్క నిలబడ మన్నాడు. రకరకాల కోణాల్లో నాలుగైదు ఫొటోలు తీశాడు. కాళ్ళు పీకెట్టి పచ్చిక మీద కూలబడ్డాను. నా ప్రక్కనే కూర్చున్నాడు ప్రభాకరం. గాలికి ఆకులన్నీ రాలుతున్నాయి మా మీద అక్షతల్లాగ. ఆకాశంలో తెల్లటి మబ్బులు శాంతి సందేశాల్లా నర్తిస్తూ పోతున్నాయి. చుట్టూ అంగరక్షకుల్లాగి కొండలు వెల్లకిల్లా పడు కున్నాను. నా మనస్సుని ఏదో మత్తు ఆవరించినట్లయింది.

"రాధా!" అని పిల్చాడు ప్రభా కరం. నేను కళ్ళు కొనల్తో చూశాను.

నా ముఖంమీద వంగి ప్రభాకరం నా పెదిమలమీద మెల్లిగా తాకాడు.

"మన పెళ్ళికి మా వాళ్ళు ఒప్పు కోవడం లేదు, రాధా!" అన్నాడు. హఠాత్తుగా నా గుండెల్లో అగ్ని పర్వతం బ్రద్దలయినట్లనిపించింది.

"ఆఁ" అన్నాను భయంగా.




"అవును. నీకు తల్లిదండ్రులు లేరట. మీ మేనమామకి కట్నం యిచ్చుకునే స్తోమత లేదట. అంచేత వద్దన్నారు" అన్నాడు ఎటో చూస్తూ.

నాకు మతిపోయింది. భవిష్యత్తు శూన్యంగా కనిపించింది.

"కాదని నిన్ను చేపడితే నాకు చిల్లిగవ్వగూడా ఆస్తి యివ్వరట. అంతా సువర్చల పేర రాస్తామన్నారు...."

దుఃఖావేగంతో నా గొంతుక పూడుకుపోయింది. మాటలు పెగిలి రాలేదు.

"అయినా నే నొక నిశ్చయానికి వచ్చాను రాధా! నాకు నువ్వే కావాలి. నీలో ఏదో నన్ను ఆకర్షించింది. పరస్పరాకర్షణ లేని దాంపత్య జీవనం నరకం. అది నూరేళ్ళ వంట. నా జీవన సహచరిని ఎన్నుకోవడంలో నాకు స్వాతంత్ర్యం వుండాలి. నేను మనిషిని. నాకూ నా అభిప్రాయాలున్నాయి. వాటిని ఆచరణలో పెట్టుకోగలిగే స్వాతంత్ర్యం కావాలి. నాతో నువ్వు హైదరాబాదు రాగలవా? అక్కడైతే నే నేదైనా ఉద్యోగం చూసుకోడానిక్కూడా అవకాశం వుంటుంది" అన్నాడు.

అంతకన్నా యేం కావాలి? నే నంటే అభిమానించే వ్యక్తికి, ప్రాణమిచ్చే వ్యక్తికి, ఆస్తిపాస్తులు ఆశించని వ్యక్తికి నే నెందుకు దూరం కావాలి.

'అలాగే!' అన్నాను.

25 మార్చి 1962

అమ్మయ్య! హైదరాబాద్ వచ్చేశాం.

ఇద్దరి వివాహం రిజిస్ట్రాఫీసులో జరిగింది.

మమ్మల్ని చుక్కలు ఆశీర్వదించాయి. చంద్రుడు శుభాభినందనలు చెప్పాడు. మబ్బుకన్నెలు గానకిన్నెర లయినయ్. దక్షిణానిలం ఇద్దరి రక్తాన్నీ హోరెత్తించింది.

ఆ పవిత్ర ఘడియల్లో నా ప్రాణానికి ప్రాణం అయిన ప్రభాకరానికి నన్ను నేనే అంకితం చేసుకున్నాను.

16 ఆగస్టు 1962

బయట చినుకులు.

గాలి హోరున వీస్తోంది.

పోనీ ఆ నాలుగు గింజలూ ఉడికిద్దామంటే బొగ్గులు తడిసిపోయాయి.

తెచ్చిన డబ్బు అయిపోయి నాలుగు రోజులయింది.

ఆయన యింకా రాలేదు.

12 గంటలు కొట్టింది గడియారం. ఈ వానలో—ఈ చీకటిలో ఆయనకై నిరీక్షణ....

నా మూలాన ఆయన కెన్ని పాట్లు? నిక్షేపంగా మహారాజులా ఉండవలసిన ఆయన—ఈనాడు....నికృష్టంగా రిక్షా లాగవలసివస్తోంది....

22 సెప్టెంబర్ 1962

ఆయనకి నాలుగు రోజుల్నించీ జ్వరం. డాక్టర్ అన్నాడు చూపిస్తే 'పక్షవాతం'.

నా గుండె ఆగినా బాగుండేది. నా ముద్దుల ప్రభాకరానికి పక్షవాతం. ఎలా నమ్మేది. ఆయన జాలిగా నవ్వుతూ 'అవునమ్మా, అతనికి జబ్బు బాగా ముదిరింది. పెద్దవాళ్ళెవరూ లేరా?' అన్నాడు.

నీరసంగా తలాడించాను. భూమి గిర్రున తిరిగినట్లయింది. ప్రపంచం మా యిద్దర్నీ ఒంటరిచేసినట్లనిపించింది.

నా కోసం తన సర్వస్వం త్యాగం చేసిన ప్రభాకరానికి—నన్ను ప్రాణం కన్న మిన్నగా ప్రేమించే ప్రభాకరానికి నేనేం చేయగలను? ఏం చేయగలను??


1 నవంబర్ 1962

రేడియో స్టేషన్లో ఉద్యోగం దొరికింది. ఈ పరిస్థితుల్లో అది నాకో వరంలా కన్పించింది. రాత్రి భోజనాలయిన తర్వాత నేనూ—ఆయనా ఆరుబైట కూర్చున్నాం.

"రాధా, నేనొకటి అడుగుతాను. నువ్వేమీ అనుకోవుగదూ?" అన్నారాయన హఠాత్తుగా.

అనుకోను చెప్పమన్నాను.

"నువ్వు నాతో వచ్చి బాధల వలయంలో పడ్డావుగదూ? పోనీ నా మానాన నన్ను వదిలేసి...." అంటూంటే చప్పున ఆయన నోటిని మూశాను.



"ఇంటిల్లపాది బైటచేరారేం — ఇప్పుడుకూడా మీ అమ్మాయి సంగీత సాధన చేస్తూనే వుందేవిటి?"

"మరింకెప్పుడూ యిలా అనకండి. నేను ప్రేమించింది మీ వ్యక్తిత్వాన్ని. మీ హృదయాన్ని. అంతే! నన్నిలా మిమ్మల్ని చూసుకుంటూ బ్రతకనివ్వండి. అదే చాలు. నాకింకేమీ వద్దు" అన్నాను.

ఆయన వినలేదు.

"అదికాదు రాధా, నేనెందుకూ కొరగాని వాడిని. నడవలేను. కనీసం కాళ్ళూ చేతులూ కదల్చలేను. నావల్ల నీ యవ్వనం, నీ ఆనందం, నీ సుఖం, నీ సంతోషం అన్నీ వృథా కావడం చూసి నేను ఊరుకోలేను. నే చెప్పిన పని చెయ్యి రాధా, ఏం?" అన్నారు.

నా హృదయం గాయపడింది. నా మీద ఆయన ప్రేమకి అంతకన్నా ఇంకేం నిదర్శనం కావాలి. నా మనసు నిండిన కృతజ్ఞతను ఆయనకెలా చెప్పుకోగలను?

మహత్తరమయిన ప్రేమ మానవ జీవితాన్ని వెలుగిస్తుంది. సంతృప్తిని యిస్తుంది. లేదా అగ్ని కీలలా దహిస్తుంది.

అదే ఆయనతో చెప్పాను. ఇలాగే నా జీవిత చరమభాగాన్ని కూడా గడుపుతానని చెప్పాను.

"అవును అదే నా గమ్యం!"

ఆయన సమాధానంగా ఉపహాసం చిందించారు.

చదవటం ముగించి ఆ కాగితాలను మడిచాడు చలపతి. బరువుగా అడుగులో అడుగు వేసుకుంటూ రాధ గది దగ్గరికి నడిచాడు.

పిచ్చిదానికి మల్లే శూన్యదృక్కుల్తో గదిలో కూర్చుంది రాధ. డైరీ కాయితాలని ఆమె చేతుల్లో పెట్టి వెనుదిరిగాడు.

తన గదిలోకి వచ్చి గబగబ సామాను సర్దుకున్నాడు. ఓ చేత్తో పెట్టె-మరోక చేత్తో బెడ్డింగ్ పట్టుకుని గది బయటికి నడిచాడు. అప్పుడే గది లోంచి బయటికి వస్తున్న రాధ అతన్ని చూసి ఆశ్చర్యపోయింది.

"ఎక్కడికి చలపతి ప్రయాణం?" అంది. ఆమె గొంతుకలో ఆత్రుత ధ్వనిస్తోంది. కొద్దిగా వొణుకుతోంది కూడా.

చలపతి నిరాశగా నవ్వాడు.

"ఇంకెక్కడికి? ఎక్కడి నించి వచ్చానో అక్కడికే పోతున్నాను. నాలుగునాళ్ళ పాటు వెలుగెలాంటిదో చూశాను. ఒక కలలాగా దాంతో ఆడుకున్నాను. ఇన్నాళ్ళ నా అన్వేషణ ఫలించిందని సంబరపడ్డాను. కాని ఆ వెలుగుని అనుభవించే అదృష్టం ఈ నిర్భాగ్యుడికి లేదు."

"అందుకని వెళ్ళిపోతున్నావా? వెళ్ళి ఏం చేస్తావు?" అంది రాధ.

"ఇన్నాళ్ళూ డబ్బు లేక పస్తులున్నాను. ఇప్పుడు చేతిలో నాలుగు రాళ్ళున్నాయి. వాటితో నా దౌర్భాగ్యం మరిచిపోడానికి ఏ త్రాగుడో అలవాటు చేసుకుంటాను.... కొంతకాలానికి ఎప్పుడో మళ్ళీ విరక్తి కలిగితే ఏ హుస్సేన్ సాగరో వుండనే వుంది." అన్నాడు.


"చలపతీ!" అంది రాధ ఆవేదనగా.

"ఎందుకు రాధా, నా మీద నీకంత జాలి, నే నెవర్ని?"

"అలా అనకు చలపతీ. నువ్వు సహజంగా తెలివైన వాడివి. కాని పరిస్థితులు నిన్ను అసమర్థుడ్ని చేశాయి. నువ్విలా మొదటికొస్తా నంటే నేను సహించలేను." అంది.

"కాని, ఏం ప్రయోజనం రాధా? నేను గొప్పవాడినే కావచ్చు. నువ్వన్నట్లు నేను అసమర్థుడినే. నువ్వి నా కండగా వుంటే నా వ్రేళ్ళు వాటి మట్టుకవే సితారు తంత్రుల్ని మీటుతాయి. కలం పరుగెడుతుంది. నీ ఆధారం చూసుకునే నా శక్తి బలం పుంజుకుంటుంది.... అది సరే, నన్ను పోనివ్వు రాధా!" అన్నాడు చలపతి ముందుకి ఒక అడుగు వేస్తూ.

రాధ పరిస్థితి అయోమయంగా



వుంది. అటు తనపై ఆధారపడిన నిస్సహాయుడైన భర్త-యిటు పిచ్చిగా ప్రేమించిన చిన్ననాటి స్నేహితుడు.. ఏం చేయాలో తోచటం లేదామెకు.

"నాకీ రాత్రి గడువియ్యి చలపతీ, నన్ను ఆలోచించుకోనియ్యి" అంటూ రాధ కన్నీరు తుడ్చుకుంటూ గది లోకి వెళ్ళి తలుపేసుకుంది.

నీరసంగా వెనక్కి తిరిగాడు చలపతి. పెట్టె-బెడ్డింగు ఒక మూల

పెట్టి యాంత్రికంగా కుర్చీలో కూర్చున్నాడు. కళ్లు మండుతున్నాయి. అప్రయత్నంగా రెప్పలు మూత పడ్డాయి. కొద్దిసేపటికి నిద్ర పోయాడు.

*    *    *

—అంతే అక్కడితో నా కలం ఆగిపోయింది. రాసిన కథని మళ్ళీ మరొకసారి చదివాను. ఇప్పటికి కథ ఒక కొలిక్కి వచ్చింది. ముగింపే తరువాయి.

ఇంతలో కామేశ్వర్రావు వచ్చాడు. కుర్చీలో కూర్చుంటూ 'కొత్తగా కథ రాశారా ?' అన్నాడు.

నేను నవ్వుతో "ఇంకా పూర్తి కాలా. రాస్తున్నాను." అన్నాను కాగితాలు అతని చేతిలో పెట్టి.

కామేశ్వర్రావు నాకు చెప్పుకో దగ్గ మంచి స్నేహితుడు. నా కథలికీ-గీతాలికీ అతనే ప్రథమశ్రోత గూడాను. నిర్మొహమాటి. తన అభిప్రాయాలను నిస్సంకోచంగా వెల్లడించే మనస్తత్వం గలవాడు. అందుకే నా స్నేహితులందర్లోకి అతన్ని ఎక్కువగా గౌరవిస్తాను. చదవడం పూర్తిచేసి అతను కాయితాలను నా చేతిలో పెట్టాడు. అదేమిటి ? ఆ కన్నీళ్ళు !

"బాగావుంది. అయితే ముగింపు సుఖాంతం చేస్తారా ? విషాదాంతమా ?" అన్నాడు.

"అదే తేలటం లేదు. రాధకీ, చలపతికీ మధ్య జరిగిన సంభాషణ ప్రభాకరం విన్నట్లూ, వారిద్దరి సౌఖ్యం కోసం తను ఆత్మహత్య చేసుకున్నట్లూ వ్రాద్దామా ? లేక రాధ చలపతితో ఏ బొంబాయో వెళ్ళిపోయినట్లు రాద్దామా అని అనుకుంటున్నాను. చలపతితోబాటు రాధ వెళ్ళిపోడానికి అంగీకరించిందని వ్రాస్తే రాధ వ్యక్తిత్వచిత్రణ దెబ్బ తింటుందేమోనని నా అనుమానం." అన్నాను నిరాశగా కాగితాల వేపు చూస్తూ.

"బాగా ఆలోచించండి. తొందర పడకండి. ముగింపు రాసి ప్రచురణకిచ్చేముందు నాకోసారి చూపించండి." అని కామేశ్వర్రావు వెళ్ళిపోయాడు.

ఉదయాన్నుంచీ కూర్చున్నానేమో ఒళ్ళంతా నొప్పిగా వుంది. పరుపు మీద వాలి దుప్పటి బుర్రమీదికి లాక్కున్నాను .... మళ్ళీ మెలకువ వచ్చేప్పటికి రాత్రి పదయింది. కథా రచనలో మునిగి మధ్యాహ్నం సరిగా భోజనం చేయలేదు. నౌకరు కుర్రాడిని కేకేసి భోజనం తీసుకురమ్మన్నాను.

అలా రెండు రోజులు గడిచినై. కథ అసంపూర్తిగా అట్లానే వుండిపోయింది. ఇవాళ ఎలాగైనా పూర్తి చేసి తీరాలని పంతంతో కూర్చున్నాను. కాగితం మీద కలం పెట్టానో లేదో 'బాబూ !' అంటూ ఓ కుర్రాడు

ప్రత్యక్ష మయ్యాడు. ఎవరో యిచ్చారంటూ ఒక కవరు నా చేతి కిచ్చాడు. తెరిచి చూశాను. వ్రాసింది కామేశ్వ్రరావు.

డియర్ గోపూ,

మీరు వ్రాసిన కథ చదివి మొన్న ఆశ్చర్యపోయాను. నా వ్యక్తిగత సమస్య మీ కెలా తెలిసిందా? అని. నా డైరీ గాని చదివారేమోనని భ్రమ పడ్డాను. సరిగ్గా మీరు కథలో రాసినట్లే జరిగింది. సౌదామిని నాకు మరదలు. చిన్నప్పట్నుంచీ మేం ఒకదగ్గరే పెరిగాం. కారణాంతరాల వలన వేరయినాం. ఒంటరి జీవితం నాకు-ముసలివాడి తోటి నరకం ఆమెకు సంప్రాప్తించాయి. మీ దగ్గరికి వచ్చిన నాడే ఆమెను నాతో రమ్మన్నాను. మీ కథలో రాధలా ఆమె ఆలోచించుకోవటానికి వ్యవధి నిమ్మంది.

ఇవాళేం జరిగిందో తెలుసా? ఆమె యింటికి మామూలుగా వెళ్ళాను. సౌదామిని చచ్చిపోయింది, బట్టలమీద కిరసనాయిలు పోంపుకుని. ఆమె వ్రాసిన ఆఖరి వాక్యాలు చదవాలని వుందా?

ఇదుగో:

"బావా!

బాధ్యతకి – హృదయానికి మధ్య సంఘర్షణలో నేను ఓడిపోయాను. ఈ జన్మలో నేను పడ్డ బాధని అశ్రు పుష్పాలుగా మార్చి వొచ్చే జన్మలో నిన్ను పూజిస్తాను.

ఎన్నటికీ
నీ
సౌదామిని."

జీవితంలో మొదటిసారిగా నేను విరక్తుడి నయ్యాను. నేను మరింక మీకు కన్పించను. అలాని ఆత్మహత్యకి పాల్పడను. ఆత్మశాంతికోసం విశ్వాన్ని గవేషిస్తూ వుంటాను. శలవు.

ఇట్లు,
కామేశ్వరరావు.

—అని వుంది అందులో.

నిశ్చేష్టుడి నయ్యాను. ఎంతఘోరం జరిగింది? బైట గాలి హోరుమని వీస్తోంది. కిటికీగుండా గాలి తీవ్రంగా లోనికి జొరబడ నారంభించింది. తలుపు మూయడానికి లేవబోయాను. కాని ఏదో బలహీనత ఆవరించింది. నే రాసిన కాగితాలన్నీ చెల్లాచెదురుగా ఆకాశంలోకి ఎగిరాయి.

వాటిని చూస్తూ నిట్టూర్చాను నేను. అంతకన్నా యింకేం చేయగలను?

---

## సినిమా క్విజ్ - జవాబులు

*1. ప్రేమలేఖలు 2. అతను ఎవరు?*